సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



తల్లి పాలే శ్రేయస్కరం

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు. అంగన్‌వాడీల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. - 8లో



గర్భిణికి ప్రాణగండం

దారుణమైన ఓ దారి గర్భిణి ప్రాణాల మీదకు తెచ్చింది. పలాస మండలంలో ఘటన జరిగింది. - 8లో

పాత్రునివలసలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస గ్రామంలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. గ్రామంలో మొత్తం 463 మందికి రూ.19.29 లక్షల మేరకు పింఛన్లు మంజూరయ్యాయి. ఈసారి కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్లు కూడా అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు, రేపు పీడీ-పీఈటీల జిల్లాస్థాయి సెమినార్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న పీడీ, పీఈటీల సెమినార్ కమ్ వర్క్‌షాప్ శుక్ర, శనివారం రెండు రోజులపాటు జరగనుందని డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి తెలిపారు. నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా గురువారం ఉదయం 9 గంటలకు మొదలవుతుందని వారు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి, రాష్ట్రమంత్రి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎమ్మెల్యేలు, ఒలింపిక్ సంఘ నాయకులు, కలెక్టర్ వంటి ప్రముఖులు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. మారిన క్రీడా పాలసీ, నూతన క్రీడా విధానాలు, స్కూల్ గేమ్స్, గ్రిగ్స్‌మీట్ పోటీల నిర్వహణ, వేదికలు ఖరారు చేయడం, పాఠశాలల్లో నమోదు చేయనున్న క్రీడా రిజిస్టర్లు తదితర అంశాలపై ఈ సెమినార్‌లో నిష్ణాతులైన వక్తలతో అవగాహన కల్పించనున్నట్టు డీఈఓ తెలిపారు.

సమన్వయమే కీలకం: జేసీ



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సునామీ వంటి విపత్తుల సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. గురువారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ఉద్ఘాటించారు. తీర ప్రాంత గ్రామాల్లో సునామీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, మత్స్యకారుల కుటుంబాలు, వారి వలలు, పడవలు, ఇతర ఆస్తులకు ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత శాఖలు పాటించాలన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (విపత్తుల నిర్వహణ) రాము మాట్లాడుతూ, తుఫానుల సమయంలో తుఫాను ఆశ్రయ కేంద్రాలను ఉపయోగిస్తామని, అయితే సునామీ వంటి పరిస్థితుల్లో అవి కూడా సురక్షితం కానందున బాధితులను తరలించడానికి ప్రత్యేకమైన, సురక్షితమైన ప్రాంతాలను గుర్తించాలని కోరారు. ఆర్డీఓ గంగాధర్ మాట్లాడుతూ, ప్రజలను తరలించడానికి సరైన ప్రణాళికను రూపొందించామని, తక్షణ చర్యలకు ఎలాంటి జాప్యం జరగదని భరోసా ఇచ్చారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా సహాయ ఫైర్ అధికారి శ్రీనుబాబు మాట్లాడుతూ, సునామీకి ముందు, సునామీ సమయంలో, సునామీ తదుపరి నిర్వహించాల్సిన కార్యక్రమాలను శాఖాపరమైన ప్రామాణిక పద్ధతుల ద్వారా అన్ని శాఖల సమన్వయం, సహకారంతో స్పందించేందుకు ఏర్పాట్లు, పరికరాలు సమకూర్చుకున్నామని తెలియజేశారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న అమరసింహుడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఇస్తున్న శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఇన్‌చార్జి జిల్లా ప్రజా రవాణా అధికారి హనుమంతు అమరసింహుడు కోరారు. శ్రీకాకుళం ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 22 వ బ్యాచ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. తదుపరి 23 వ బ్యాచ్ సెప్టెంబర్ నెలలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఫీజు, ఇతర వివరాలకు 7382921733 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అన్నదాత సుఖీభవకు రూ.184 కోట్లు

- ఆగస్టు 2న జిల్లా వ్యాప్తంగా పంపిణీ
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 2,74,301 మంది రైతులకు రూ.184 కోట్లు అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆగస్టు 2న జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులకు నేరుగా నగదు మంజూరు చేస్తామని వెల్లడించారు. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఆగస్టు 2న ప్రతి గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించి, అర్హులైన రైతులకు లబ్ధి అందించాలన్నారు. రైతులు తమ అర్హతను తెలుసుకోవడానికి 'అన్నదాత సుఖీభవ పోర్టల్' లేదా 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఆధార్-బ్యాంక్ ఖాతా అనుసంధానం వంటి పెండింగ్ అంశాలు పూర్తిచేసుకోవాలని సూచించారు.

జి.సిగడాం మండలం నక్కపేటలో ఆక్రమణకు గురైన గుంటుకువాని చెరువు ఇది. సర్వే నంబరు 226లో 31.90 ఎకరాల విస్తీర్ణంలో గల చెరువు ఆక్రమణలో కుచించుకుపోయింది. ఇందులో 10 ఎకరాల వరకు ఆక్రమించినట్టు ఆరోపణలు ఉన్నాయి. చెరువు గర్భంలో మట్టిని వేసి పొలాలు చేసుకుని అనుభవిస్తున్నారు.





చెరువులు..శ్మశానం

సర్వం స్వాహార్పణం!

- నక్కపేటలో ఆక్రమణలు
- కబ్జాతో కనుమరుగవుతున్న చెరువులు
- సాగునీరు అందక రైతులు ఇబ్బందులు
- శ్మశాన వాటికను వదలని ఆక్రమణదారులు
- దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు
- అధికారులకు ఫిర్యాదు చేసినా.. సీఎంకు ఫిర్యాదులు వెళ్లినా స్పందన శూన్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జి.సిగడాం మండలం సీతంపేట పంచాయతీ నక్కపేట గ్రామంలో సాగునీటి చెరువులు అన్యాక్రాంతమయ్యాయి. ఆక్రమించిన చెరువు గర్భంలో మట్టి వేసి పొలాలుగా మార్చుకుని సాగు చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. దీంతో చెరువులు కుచించుకుపోయాయి. చెరువులు కాస్త చిన్న మురికి కాలువలుగా మారిపోతున్నాయి. సాగునీటి అవసరాల కోసం పెద్దలు చెరువులు తవ్విస్తే వాటినే కబ్జా చేసి పొలాలుగా మార్చుకుంటున్నారు. ఈ గ్రామంలో కళ్ల ముందే మర్రిబంద చెరువు, గుంటుకువాని చెరువు ఆక్రమణలకు గురైనట్టు కనబడుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. చివరికి కలెక్టర్‌కు, సీఎంకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. గతంలో ఒకసారి ఆక్రమణదారుల నోటీసుల డ్రామా నడిచినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయో తెలీదు గానీ ఆక్రమణలు ఎక్కడికక్కడ అలాగే ఉన్నాయి. చెరువుల పునరుద్ధరణ జరగలేదు.





ఆక్రమణలో ఉన్న నక్కపేట శ్మశాన వాటిక ఇది. సర్వే నంబరు239/9లో ఐదు ఎకరాల్లో శ్మశాన వాటిక ఉండేది. మర్రిబంద చెరువు, గుంటుకువాని చెరువు మధ్యలో శ్మశాన వాటిక ఉండగా.. దాన్ని కూడా ఆక్రమణదారులు వదల్లేదు. దీంతో దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నాయి.



ఆక్రమణలో ఉన్న మర్రి బంద చెరువు గట్టుపై వేసిన పశువుల పాకలివి. సర్వే నంబరు 236లో ఉందీ స్థలం. దీని విస్తీర్ణం 4.32 ఎకరాలు. కొంత మంది చెరువును కప్పేసి పొలాలుగా మార్చారు. చెరువు మదుములు పూడ్చేశారు. చెరువు చప్టాను పొడిచేశారు. అలాగే చెరువు గట్టుపై మూగజీవాల కోసం పాకలు వేసుకున్నారు.



శ్మశానాలకు సమాధి... ఆక్రమణలకు పునాది

గ్రామంలో చెరువులే కాదు.. ఆ చెరువుల మధ్య ఉన్న శ్మశాన వాటిక భూమిని కూడా ఆక్రమించేశారు. సాధారణంగా శ్మశానాల జోలికి వెళ్లడానికి భయపడతారు. కానీ, ఇక్కడేంటో శ్మశానాలను సైతం వదల్లేదు. మర్రిబంద చెరువు, గుంటుకువాని చెరువు మధ్య ఉన్న ఐదెకరాల శ్మశానంలోనూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తమకు అనుకూలంగా మార్చుకుని అనుభవిస్తున్నారు. దీంతో శ్మశానం వాటిక కూడా ఆక్రమణదారుల చేతిలో చిక్కుకుపోయింది. ఇక్కడ ఒక్కో ఎకరం విలువ రూ.30లక్షలు దాటి ఉంటుంది. ఈ లెక్కన ఆక్రమణదారులు కబ్జా చేసిన చెరువు, శ్మశాన వాటిక భూముల విలువ రూ. కోట్లలో ఉంటోంది.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పరిస్థితి

చెరువులు, శ్మశాన వాటిక ఆక్రమణలకు గురయ్యాయని అటు తహసీల్దార్, కలెక్టర్‌కు, ఇటు సీఎంకు ఫిర్యాదు చేసినా స్పందన ఉండటం లేదు. దీన్ని బట్టి ఇక్కడ ఆక్రమణల వెనక ఎవరున్నారో స్పష్టమవుతోంది. కొంతమంది మాత్రం పశువుల పాకలు వేసుకున్నామని, వాటిని తొలగిస్తే మరొకచోట పశువుల శాలకు స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదొక సమస్యగా మారడంతో అధికారులు సైతం ఊగిసలాట ఆడుతున్నారు.



దివ్యాంగ పింఛన్ల కోత

- వెరిఫికేషన్‌కు హాజరు కాని వారికి ఆగస్టు నుంచి పింఛను కట్
- తొలి దశలో 1458 పింఛన్ల నిలుపుదల
- రానున్న రెండు నెలల్లో మరిన్ని పింఛన్లు రద్దు చేసేందుకు ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగ పింఛన్లపై సర్కారు కత్తిని వేలాడదీసింది. వెరిఫికేషన్‌కు హాజరు కాని వారి పింఛన్లను తెగ్గోయడానికి సిద్ధమైపోయింది. ఈ నెలలోనే జిల్లాలో తొలి దశగా 1458 పింఛన్లు ఆపేయడానికి నిర్ణయం తీసుకుంది. గత 18 నెలలుగా జిల్లాలో సుమారుగా 20,000 పింఛన్లను కోసేశారు. వారి స్థానంలో కొత్తవారికి పింఛన్లు అందించాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. కనీసం కొత్తవారు పింఛను కోసం దరఖాస్తు, నమోదు చేసుకొనే వెసులుబాటు కూడా చాలా కాలం లేదు. దివ్యాంగుల పింఛను మొత్తాన్ని పెంచామని చెబుతూనే.. అర్హుల జాబితాకు కోతలు పెడుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లను మంజూరు చేసేవారు. అర్హులను నేరుగా ప్రభుత్వం వలంటీర్ల ద్వారా గుర్తించి వారి ఇంటికి వెళ్లి దరఖాస్తులు స్వీకరించి, వారికి పింఛను మంజూరు చేసేలా చర్యలు తీసుకునేవారు. కానీ ఇప్పుడు పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వీలే లేకుండాపోయింది.

సర్కారు అనుకున్నట్టుగానే..

కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగ పింఛన్లు తగ్గించడానికి అన్ని దారులు వెతుకుతోంది. వారు అనుకున్నట్లుగానే ఆగస్టు ఒకటో తేదీ నుంచి దివ్యాంగ పింఛన్ల కోత ప్రారంభం కానుంది. గడిచిన ఏడాదిగా దివ్యాంగ పింఛన్లపై పునఃపరిశీలన చేస్తోంది. ఈ వెరిఫికేషన్‌కు ఇప్పటివరకు హాజరు కాని వారికి పింఛన్లు తొలగించనుంది. తొలి దశలో 1458 మంది పింఛన్లు తీసేస్తున్నారు. జిల్లాలో దాదాపు 3.12 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారు 31,502 మంది ఉన్నారు. మల్టీ డిజేబుల్ మినహా మిగతా వారు రీ వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం గతంలో నోటీసులు జారీ చేసింది. ఈ రీ వెరిఫికేషన్లు నరసన్నపేట, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి రిమ్స్‌లలో జరిగాయి. నరసన్నపేట, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి, ఆస్పత్రుల పరిధిలో దివ్యాంగ పింఛనుదారులకు రీ వెరిఫికేషన్ పూర్తయ్యింది. లావేరు ఎచ్చెర్ల మండలాలకు సంబంధించి రిమ్స్‌లో ప్రక్రియ జరుగుతోంది. బూర్జ, పొందూరు, శ్రీకాకుళం టౌన్, శ్రీకాకుళం రూరల్ మండలాల వారికి ఆగస్టు, సెప్టెంబర్‌లో రీ వెరిఫికేషన్ జరగనుంది. బుధ, గురు, శుక్రవారాల్లో రోజుకు 150 మందికి ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను ముగ్గురు వైద్యులను నియమించారు.


Forwarded
వెరిఫికేషన్కు హాజరుకాని వికలాంగులకు గమనిక :
[Reverification] ... 1, 2025 ...
SMS ...
SMS Format
... - AP SERP (పింఛన్లు)

సెర్ప్ ప్రకటన (పింఛను దారులకు పెట్టిన మెసేజ్)

ఎరువుల సమస్యలపై కంట్రోల్ రూమ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులకు ఎరువుల లభ్యత, సరఫరా, ధరలపై ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులు స్పందించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఎరువుల సంబంధిత సమస్యలను కంట్రోల్ రూమ్ నంబర్ 9121863788 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని కోరారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సమర్థంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.

జాతీయ విద్యా విధానం ఉత్సవంలో ఉమామహేశ్వరి



అవార్డు తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి

ఇచ్ఛాపురం రూరల్: న్యూఢిల్లీలో జరుగుతున్న జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ)-2025 ఉత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఈదుపురం కంద్రావార్డు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూరవిల్లి ఉమామహేశ్వరి పాల్గొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈమె గురువారం విద్యార్థులు జి.లావణ్య, టి.శ్రావ్యలతో కలసి న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో జరిగిన వేడుకలో పాల్గొన్నారు. గతంలో రేగిడిలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేసిన సమయంలో ఈమె మార్గదర్శకత్వంలో రూపొందించిన 'నేచురల్ హెయిర్ డై' సైన్స్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన రెండు ప్రాజెక్ట్‌లలో ఒకటిగా పేరు పొందింది. ప్రాజెక్ట్‌ను స్వయంగా తిలకించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆమెను అభినందించారు. ఇండియాలో 27 ఉత్తమ ప్రాజెక్ట్‌లలో ఉమామహేశ్వరి రూపొందించిన 'నేచురల్ హెయిర్ డై' ప్రాజెక్ట్ ఒకటి కావడం విశేషం. ఈ సందర్భంగా ఆమెకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ అసిస్టెంట్ డైరెక్టర్ యోగేష్ బ్రహ్మంకర్, మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎలంగోవన్‌లు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.కుమారస్వామి, మండల విద్యాశాఖాధికారులు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం అభినందించారు.

'బంగారం కొంటే రశీదు తప్పనిసరి'



బంగారం షాపులో తనిఖీలు చేసి సూచనలు చేస్తున్న చిన్నమ్మి

నరసన్నపేట: బంగారం షాపుల్లో బంగారం, ఆభరణాలు కొనుగోలు చేసే వినియోగదారులకు విధిగా రశీదులు ఇవ్వాలని తూనికలు, కొలతల అసిస్టెంట్ కంట్రోలర్ పి.చిన్నమ్మి వ్యాపారులకు సూచించారు. అలాగే ఈ రశీదులపై బంగారం ఏ క్యారెట్ అనేది కూడా స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. నరసన్నపేటలో బంగారు షాపులను ఆమె గురువారం తనిఖీ చేశారు. రశీదులు ఇవ్వడం లేదని, ఇచ్చిన రశీదులపై క్యారెట్ల వివరాలు ఉండడం లేదని తెలిపారు. ఇలా ఇవ్వని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే షాపుల్లో వ్యాపారులు వినియోగిస్తున్న తూకాలను పరిశీలించారు. వినియోగిస్తున్న ప్రతి తూకానికీ సీళ్లు వేయించుకోవాలని ఆదేశించారు.

ఎల్.ఎన్.పేట..

జాప్యం ఎందుకట?



ఎల్ఎన్‌పేట మండలానికి దిక్కుగా మారిన సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్

- పోలీస్‌స్టేషన్ లేని ఏకైక మండలంగా లక్ష్మీనర్సుపేట
- దశాబ్దాల హామీ కార్యరూపం దాల్చని వైనం
- కేసులు, ఫిర్యాదులకు పక్క మండలానికి వెళ్లాల్సిందే

హిరమండలం: లక్ష్మీనర్సుపేట.. అందరూ ఎల్.ఎన్.పేటగా పిలిచే ఈ మండలానికి ఓ సమస్య నిత్యం వెంటాడుతుంటుంది. మండల కేంద్రానికి అవసరమైన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికీ శాంతిభద్రతల పర్యవేక్షణలో కీలకమైన పోలీస్‌స్టేషన్ మాత్రం ఏర్పాటు కావడం లేదు. ప్రస్తుతం ఎల్ఎన్‌పేట మండలానికి సంబంధించి శాంతిభద్రతల పర్యవేక్షణ అంశం సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంది. దీంతో చిన్న చిన్న కేసులు, రోడ్డు ప్రమాదాలు వంటి విషయంలో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఎల్ఎన్‌పేటలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేస్తామని దశాబ్దాలుగా చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. జిల్లాలో పోలీస్‌స్టేషన్ లేని మండలంగా ఎల్ఎన్‌పేట మిగిలిపోతోంది.

రెండున్నర దశాబ్దాలుగా..

జిల్లాలో భౌగోళికంగా ఉన్న అతి పెద్ద మండలం సరుబుజ్జిలి. దీంతో పాలనాపరమైన సౌలభ్యం కోసం 1999లో సరుబుజ్జిలి నుంచి ఎల్ఎన్‌పేట మండలాన్ని 19 పంచాయతీలతో ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఎల్ఎన్‌పేట మండల కేంద్రంగా కొనసాగుతూ వచ్చింది. అప్పట్లోనే శాఖలపరంగా అన్ని కార్యాలయాలను ఏర్పాటు చేయాలని భావించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కేజీబీవీ, ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వంటివి ఏర్పాటు చేశారు. కానీ పోలీస్‌స్టేషన్ మాత్రం కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతానికి మండల పరిధి పెరిగింది. ముఖ్యంగా వంశధార నిర్వాసిత గ్రామాలు పెరిగాయి. చిన్నకొల్లివలస, గార్లపాడు, పాడలి, తులగాం నిర్వాసిత గ్రామాల వారు ఎల్ఎన్‌పేట మండలంలో వేర్వేరు పంచాయతీల్లో నివాసం ఏర్పాటుచేసుకున్నారు. మరోవైపు మోదుగువలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, శ్యామలాపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, తాయిమాంబాపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పేరుతో మూడు పంచాయతీలు సైతం ఎల్ఎన్‌పేట మండలంలో చేరాయి. ప్రస్తుతం మండల భౌగోళిక పరిధి 72 కిలోమీటర్లుగా ఉంది.

జనాభా పెరిగినా..

ప్రస్తుతం మండలంలో జనాభా 40 వేల వరకూ ఉంటుందని అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం 27 వేల మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం మండలం పరిధి పెరిగింది. జనాభా కూడా గణనీయంగా పెరిగింది. ప్రతి 30 వేల మంది జనాభాకు పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేయాలన్న నిబంధన ఉంది. ఈ లెక్కన ఇక్కడ కచ్చితంగా స్టేషన్ ఏర్పాటుచేయాలి. అయినా పోలీస్ శాఖ పట్టించుకోవడం లేదు. ఈ మండలం మీదుగా అలికాం-బత్తిలి రహదారి ఉంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలు సైతం ఉన్నాయి. ఏటా శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థ స్నానం జరుగుతుంటుంది. ఆ సమయంలో పక్క మండలాల నుంచి పోలీస్ సిబ్బంది వచ్చి విధులు నిర్వహిస్తుంటారు. జిల్లాకు డీజీపీ, డీఐజీ స్థాయి అధికారులు వచ్చిన సమయంలో ఎల్ఎన్‌పేటలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుపై మాట్లాడుతుంటారు. తర్వాత మరిచిపోతుంటారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని స్త్రీ శక్తి భవనంలో అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ ఎల్.ఎన్.పేట మండలంలో పోలీస్ స్టేషన్ లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవుట్ పోస్టు సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పని చేస్తుందన్నారు.

స్టేషన్ ఏర్పాటుచేయాలి



ఎప్పుడో 1999లో మండలాన్ని ఏర్పాటుచేశారు. అయినా ఇంతవరకు పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో కేసులు, ఫిర్యాదులు వంటి వాటి కోసం సరుబుజ్జిలి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాలి. - పెనుమజ్జి విష్ణుమూర్తి, యంబరాం, ఎల్ఎన్‌పేట మండలం





ప్రకృతి 'ఉదయ' స్పందన

ఉదయారుణ కాంతుల్లో ప్రకృతి ఇలా తన హృదయాన్ని ఆవిష్కరించింది. పెంట-మర్రివలస గ్రామాల సమీపంలో పొలాలు, మేఘాలు, కిరణాలు కలగలిపి ఈ ఆహ్లాదకర దృశ్యాలకు పురుడు పోశాయి. - జి.సిగడాం

క్లుప్తంగా

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి


సింహాచలం మృతదేహం

పొందూరు: పొందూరు పంచాయతీ పరిధిలోని జోగన్నపేట వద్ద బుధవారం రాత్రి ఆటో ఢీకొని అదే గ్రామానికి చెందిన టొంపల సింహాచలం (80) అనే వృద్ధుడు మృతి చెందాడు. పొందూరు నుంచి దేవరవలస వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలోనే వృద్ధుడు మృతి చెందాడు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సింహాచలంకు ఓ కుమార్తె ఉంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ


తలకొరివి పెట్టిన కుమార్తె

సరుబుజ్జిలి: పాతపాడు గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు టంకాల చినఅప్పలనాయుడు గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయనకు కుమారులు లేరు. ముగ్గురూ కుమార్తెలే. దీంతో పెద్దకుమార్తె విజయలక్ష్మి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి చితికి నిప్పంటించి రుణం తీర్చుకున్నారు.

వైఎస్సార్‌ సీపీ సర్పంచ్‌ మృతికి సంతాపం


కిల్లి సావిత్రి (ఫైల్‌)

టెక్కలి: తలగాం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ కిల్లి సావిత్రి గురువారం మృతి చెందారు. ఈమె వైఎస్సార్‌సీపీ తరఫున రెండు సార్లు సర్పంచ్‌గా సేవలు అందజేశారు. ఈయన సోదరుడు వెంకటేశ్వర్రావు ప్రస్తుతం వైఎస్సార్‌ కాంగ్రెస్‌ మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలు అందజేస్తున్నారు. సావిత్రి మృతి పట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌, జెడ్పీటీసీ దువ్వాడ వాణి, ఎంపీపీ అట్ల సరోజనమ్మ, వైస్‌ ఎంపీపీలు పి.రమేష్‌, ఎం.కిషోర్‌, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

తీర ప్రాంత భద్రతకు పక్కా చర్యలు: కలెక్టర్‌


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జిల్లాలో తీర ప్రాంతాలైన బారువ, కళింగపట్నం, భావనపాడు తదితర తీర ప్రాంతాల భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌ ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో కలెక్టర్‌ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. సముద్రంలో పని చేసే ప్రతి మత్స్యకారుడు భద్రతతో కూడిన లైఫ్‌ జాకెట్‌ విధిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని, 40 శాతం సబ్సిడీతో లభించే లాబ్‌ జాకెట్లను 60 శాతం లబ్ధిదారు భరించాల్సి ఉన్నప్పటికీ అందులో 30 శాతం కలెక్టర్‌ నిధుల నుంచి సమకూరుస్తామని, మిగిలిన 30 శాతం కూడా సీఎస్‌ఆర్‌ నిధుల నుంచి అందించే చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ తెలిపారు. అయితే లైఫ్‌ జాకెట్ల పంపిణీ అనంతరం లైఫ్‌ జాకెట్‌ లేకుండా ఏ ఒక్కరు సముద్రంలోకి వెళ్లరాదని సూచించారు. బీచ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తీర ప్రాంత మెరైన్‌ పోలీస్‌ స్టేషన్‌లకు బయో ఫెన్సింగ్‌ విధానంలో కాంపౌండ్‌ వాల్‌ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా తీర ప్రాంతాలలో వాచ్‌ టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.

బీసీ హాస్టల్లో మౌలిక సదుపాయాలపై ఆరా


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దష్టికి తీసుకురావాలని సూచించారు. శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాది కె.ఇందిరా ప్రసాద్‌, సంఘ సేవకులు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేయస్కరం..!

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు



అంగన్‌వాడీ కేంద్రాలు	3385
గర్భిణులు	9667
బాలింతలు	11355
చిన్నారులు (7 నెలలు–3 ఏళ్లు)	65422
చిన్నారులు(3–6 ఏళ్లు)	39939

ఇచ్ఛాపురం రూరల్‌/హిరమండలం/పాతపట్నం: పసిపిల్లలకు తల్లిపాల కంటే శ్రేష్టమైనవి ఈ సృష్టిలో ఏవీ లేవు. అయితే కొందరు బాలింతలు వివిధ కారణాలతో ముర్రుపాలు పెట్టేందుకు విముఖత చూపుతున్నారు. ఇది పసిపిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరించేందుకు ప్రభుత్వం ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వారం రోజుల పాటు గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోంది. శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా.. రోగ నిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలు పట్టాల్సిందేనని, తల్లిపాలతో బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వాటిలో ఉన్న పోషకాలు, విశిష్టతను ప్రతి ఒక్కరికీ వివరిస్తారు.

బిడ్డలకు ప్రయోజనాలు ఎన్నో..

- విటమిన్లు, ప్రొటీన్లు, ఫ్యాట్‌ వంటివి తల్లిపాలలోనే లభిస్తాయి.
- తల్లిపాలలో ఎటువంటి హానికరమైన సూక్ష్మక్రిములు సైతం ఉండవు. తల్లిపాలు తాగడం వల్ల పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదుగుతారు.
- బిడ్డకు జన్మనిచ్చిన నాలుగు రోజుల వరకూ లభించేవాటిని ముర్రుపాలు అంటారు. ఇవి తాగితే బిడ్డకు అలర్జీ, ఇన్‌ఫెక్షన్లు వంటివి సోకవు. జీర్ణ వ్యవస్థకు ఎటువంటి హాని కలగకుండా రక్షిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.
- తల్లిపాలు తాగితే పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని వివిధ పరిశోధనల్లో సైతం తేలింది. అలాంటి వారు చదువుల్లో సైతం బాగా రాణిస్తారని వివిధ అధ్యయనాల్లో తేలింది. అందుకే పిల్లలు బాగా చదవాలన్నా.. ఆరోగ్యంగా ఉండాలన్నా ప్రాథమిక స్థాయిలో తల్లిపాలు పెట్టడం ఉత్తమం.
- తల్లిపాలలో విటమిన్లు, ప్రొటీన్లు, ఖనిజాలు, కార్బోహైడ్రేట్‌లు వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. శరీరానికి అవసరమైన కొవ్వులు కూడా అందిస్తాయి. ఇవన్నీ బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడతాయి. తల్లిపాలు సులభంగా జీర్ణం అవుతాయి. మలబద్ధకం, జీర్ణ సంబంధిత వ్యాధులు ఎదురుకాకుండా చూసుకోవచ్చు.
- ఎదిగే బిడ్డ వయసుకు తగ్గట్టు బరువు ఉంటేలా తల్లిపాలు దోహదం చేస్తాయి. కేవలం ప్రాథమిక స్థాయిలోనే కాదు..పెద్దయ్యాక అధిక బరువు, స్థూలకాయం వంటి సమస్యలుబారిన పడకుండా చేస్తాయి.
- పిల్లలకు రెండేళ్ల వరకూ తల్లిపాలు ఇవ్వొచ్చు. కానీ చాలా మంది ఆరు నెలలకే పాలు ఇవ్వడం ఆపేస్తుంటారు. ఆరు నెలల తరువాత ఘన ఆహారం ఇస్తుంటారు. ఈ క్రమంలో అన్నిరకాల పోషకాలు వారికి అందవు. కాబట్టి ఆరు నెలల తరువాత ఘన ఆహారంతో పాటు అప్పుడప్పుడు తల్లిపాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరం.
- కనీసం సంవత్సరం వరకైనా కొనసాగించడంతో పిల్లలతో పాటు తల్లులకు ఎంతో ప్రయోజనకరం. తల్లి పిల్లకు పాలివ్వడం ద్వారా వారి మధ్య బలమైన బంధం ఏర్పడుతుంది. పిల్లలు తల్లి పాలను తాగే క్రమంలో తల్లిప్రేమ, అప్యాయత చూస్తారు. తల్లి ఒడి కంటే సురక్షితమైన ప్రదేశం మరెక్కడా లేదని గ్రహిస్తారు.


తల్లిపాల వారోత్సవాలు ర్యాలీ(ఫైల్‌)

తల్లులకూ మేలే..

- తల్లిపాలు తాగడం వల్ల పిల్లలకే కాదు అమ్మలకు కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. బిడ్డ రొమ్ము పట్టినప్పుడు తల్లి మెదడు నుంచి కొన్ని రకాల సంకేతాలు వస్తాయి. ఆక్సిటోసిస్‌ అనే హార్మోన్‌ విడుదల అవుతుంది. ఇది పాలు పడడానికే కాకుండా గర్భాశయం సంకోచించేందుకు ఎంతగానో దోహదం చేస్తుంది.
- కాన్పు తరువాత రక్తస్రావం తగ్గుతుంది. మాతృమరణాల్లో చాలా వరకూ రక్తస్రావం ఆగకపోవడమే కారణంగా ఉంటోంది. కాన్పు తరువాత ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటివి బిడ్డకు పాలివ్వడంతో తగ్గముఖం పడతాయి. పాలివ్వడం వల్ల తల్లి బరువు తగ్గుతారు. గర్భిణిగా ఉన్న సమయంలో చాలా మంది బరువు ఎక్కువగా పెరుగుతారు. పిల్లలకు పాలివ్వడంతో వారు తగ్గుతారు. పాలు పట్టే క్రమంలో తల్లి శరీరంలో క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి. అందుకే బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు.
- పాలు పట్టడంతో తల్లి మధుమేహం, బీపీ వంటి రుగ్మతలు దరిచేరవు. పాలివ్వడంతో తల్లికి హాయిగా నిద్ర వస్తుంది. మానసిక ప్రశాంతత ఉంటుంది. భావోద్వేగాల నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుంది. రొమ్ము క్యాన్సర్‌, గర్భాశయ క్యాన్సర్‌ బారిన పడకుండా రక్షణ పొందవచ్చు.

అపోహలు విడనాడాలి



తల్లిలకు పాలు ఇస్తే ఆరోగ్యం దెబ్బతింటుందని, అందం కోల్పోతామని కొంత మంది తల్లులు అపోహ పడుతుంటారు. అందుకే పిల్లలకు పాలు ఇవ్వడానికే వెనుకడుగు వేస్తారు. కానీ ఇలాంటి అపోహలన్నీ విడనాడి పిల్లలకు పాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరం.

– డాక్టర్‌ జి.అనిత, స్త్రీ, ప్రసూతి విభాగం వైద్యనిపుణులు, సీహెచ్‌సీ పాతపట్నం

బాధ్యతగా భావించాలి



ముర్రుపాలు పట్టించడం భారం అనుకోవద్దు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. తల్లికి అన్ని రకాల ఆహారం పెట్టాలి. 6 నెలల తరువాత తల్లిపాలతో పాటు ఇంట్లో తినే ఆహారం మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు రెండు ఏళ్ల వరకు తల్లిపాలు కొనసాగించాలి. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. – సీహెచ్‌ ఇందిరా, ఐసీడీఎస్‌ సీడీపీవో, పాతపట్నం

అవగాహన కల్పిస్తాం



తల్లిపాలు అమృతంలాంటివి. తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పుట్టిన గంటలోపే తల్లిపాలు బిడ్డకు తాగించడం ద్వారా బిడ్డకు మేలు జరుగుతుంది. ఈ నెల మొదటి వారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

– ఐ.విమల, పీడీ, ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌, శ్రీకాకుళం

రోడ్డు అధ్వానం.. గర్భిణికి ప్రాణగండం



పలాస మండలం కొతారింగు తాళ్లభద్ర గిరిజన గ్రామానికి పక్కా రోడ్డు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం గ్రామానికి చెందిన ఓ గర్భిణికి పురిటినొప్పులు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్‌ గ్రామానికి వెళ్లే దారిలో బురదలో దిగిపోయింది. డ్రైవర్‌ ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కొందరు స్థానికులు వచ్చి నెట్టడంతో అతికష్టమ్మీద ముందుకు కదిలింది. అనంతరం గర్భిణిని పలాస సీహెచ్‌సీకి తరలించారు.

– కాశీబుగ్గ



వర్షం పడితే కొతారింగు తాళ్లభద్ర రోడ్డు దుస్థితి ఇదీ

2 కిలోమీటర్లు.. 400 మంది పోలీసులు

- నిమ్మాడలో అనధికారిక బందోబస్తు
- కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఇంట్లో వేడుకకు పోలీసుల పహారా

శ్రీకాకుళం క్రైమ్‌ : జిల్లాలో గురువారం ఏ పోలీస్‌ స్టేషన్‌ చూసినా నలుగురైదుగురు సిబ్బందే ఉన్నారు. మిగతా వాళ్లంతా పక్క జిల్లాలో బందోబస్తుకో.. లేదంటే నేరస్థలిలో పికెట్‌కో వెళ్లారంటే తప్పులో కాలేసినట్లే. కేంద్ర, రాష్ట్ర మంత్రుల సోదరుని ఇంట్లో జరిగే ఓ వివాహ వేడుకకు పహారా కాశారు. జిల్లా నలుమూలల నుంచి దిగువస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు దాదాపు 400 మంది సిబ్బంది నిమ్మాడలో బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. ఇది ప్రయివేటు కార్యక్రమం కావడంతో అనధికారికంగానే బందోస్తు నిర్వహించినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. నిమ్మాడ జంక్షన్‌ నుంచి వేడుక జరిగే గ్రామం లోపలి వరకు 2 కిలోమీటర్ల మేర అడుగడుగునా పోలీసులే కనిపించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు ఉదయం నుంచే బందోబస్తు విధులు పర్యవేక్షించారు. మంత్రుల సోదరుడు సైతం పోలీసు విభాగానికి చెందిన వ్యక్తే కావడంతో ఎక్కడా మాట రాకూడదన్నట్లు దిగువ స్థాయి సిబ్బంది సైతం సుదూర ప్రాంతాల నుంచి ఎండలో మగ్గి మరీ విధులు నిర్వర్తించారు.

దేవరాపల్లి కష్టాలు దేవుడికే ఎరుక!




కూటమి ప్రభుత్వంలో రహదారుల పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతోంది. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా అనేక చోట్ల రోడ్డు పనులు పేరిట తవ్వేసి వదిలేస్తున్నారు. నెలల తరబడి పనులు పూర్తి చేయకపోవడంతో జనం నరకయాతన అనుభవిస్తున్నారు. రణస్థలం మండలం దేవరాపల్లి నుంచి కమ్మసిగడాం వచ్చే రహదారిని బాగు చేస్తామంటూ జనవరిలో తవ్వి వదిలేశారు. రోడ్డంతా గోతులమయం కావడంతో వాహనచోదకులు గగ్గోలు పెట్టడంతో ఇటీవల క్రషర్‌ పోగులు వేశారు. వాటిని నెరపకుండా వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదేం బాదరా 'బాబూ' అంటూ జనాలు తిట్టుకుంటున్నారు. – రణస్థలం

సేవలతోనే గుర్తింపు


సత్కారం పొందిన పోలీసులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్‌ : జిల్లా పోలీసు శాఖలో పనిచేసి గురువారం ఉద్యోగ విరమణ పొందిన పలువురు పోలీసులకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్వీసులో ఒత్తిళ్లు, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. సత్కారం పొందిన వారిలో సీఐ సీహెచ్‌ రాజశేఖర్‌, ఎస్‌ఐలు ఎస్‌.వెంకటరమణ (పోలీస్‌కంట్రోల్‌ రూం), ఎం.చంద్రరావు (కాశీబుగ్గ), ఏఎస్‌ఐలు ఆర్‌.కూర్మారావు (కవిటి), డి.నిర్మల (హిరమండలం) ఉన్నారు.

టి.డి.వలసలో ఐదు బృందాల సర్వే

జి.సిగడాం: టంకాల దుగ్గివలస గ్రామంలో జ్వరాలను అదుపు చేయడానికి ఐదు బృందాలను ఏర్పాటు చేశారు. వీరంతా ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్‌, పేకల సుమబిందు తెలిపారు. గురువారం కాలువల్లో బ్లీచింగ్‌ పౌడర్‌, దోమల నివారణ మందులను పిచికారి చేశారు. ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అసిరయ్య పర్యవేక్షించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాభారతి కార్యవర్గం ఏర్పాటు


మాట్లాడుతున్న క్రీడాభారతి నూతన అధ్యక్షుడు చెటికం రాజ్‌కుమార్‌

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రీడాభారతి నూతన కార్యవర్గం గురువారం ఏర్పాటైంది. అరసవిల్లి సమీపంలోని చైతన్య విద్యా విహార్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడిగా చెటికం రాజ్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా బలగ అనంత లక్ష్మదేవ్‌ (అను), కోశాధికారిగా దండాసి జ్యోతిభాస్కర్‌ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ కర్త, ఒలింపియన్‌ ఎం.వి.మాణిక్యాలు మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తి ఉన్న ఒక క్రీడను మాత్రమే ఎంచుకని, అందులోనే ఉన్నతంగా సాధన చేసి రాణించాలన్నారు. సెల్‌ఫోన్లకు, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్‌ అధికారి వంగా మహేష్‌, క్రీడాభారతి సభ్యులు బి.ఖగేశ్వరరావు, మణికంఠ, కృష్ణారావు, ప్రసాద్‌, పాఠశాల ప్రతినిధులు, టీచర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జెడ్పీలో పలువురికి పదోన్నతులు


నియామకపత్రాలను అందజేసిన జెడ్పీ చైర్‌పర్సన్‌ విజయ

అరసవల్లి : జిల్లా పరిషత్‌ యాజమాన్య పరిధిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లా పరిషత్‌ బంగ్లాలో గురువారం జెడ్పీ చైర్‌పర్సన్‌ పిరియా విజయ ఆధ్వర్యంలో పదోన్నతులు పొందిన వారికి కొత్తగా నియామక ఉత్తర్వులు అందజేశారు. పలాస మండల కార్యాలయం టైపిస్టు జి.లక్ష్మణరావును టెక్కలి మండల కార్యాలయం సీనియర్‌ అసిస్టెంట్‌గా, సీతంపేటలో టైపిస్టుగా పనిచేస్తున్న ఆర్‌.కిషోర్‌కుమార్‌కు రేగిడిలో సీనియర్‌ అసిస్టెంట్‌గా, జలుమూరులో టైపిస్టుగా పనిచేస్తున్న జి.ఈశ్వరరావుకు నరసన్నపేటలో సీనియర్‌ అసిస్టెంట్‌గా, కంచిలిలో టైపిస్టుగా పనిచేస్తున్న సంజయ్‌కుమార్‌ సాహును సోంపేటలో సీనియర్‌ అసిస్టెంట్‌గా పదోన్నతులు కలిపించారు. అలాగే చాపర జెడ్పీ స్కూల్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌.సంపత్‌కుమార్‌ను భామినిలో సీనియర్‌ అసిస్టెంట్‌గా, పాతపట్నంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జె.మీరాబాయిని కొత్తూరు సీనియర్‌ అసిస్టెంట్‌గా, శ్రీకూర్మంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.శివరాంను పాలకొండ సీనియర్‌ అసిస్టెంట్‌గా, మందస జెడ్పీ స్కూల్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.మాలతిని సీతంపేట సీనియర్‌ అసిస్టెంట్‌గా, స్థానిక జిల్లా పరిషత్‌ కార్యాలయంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పివి.మిశ్రాను సంతబొమ్మాళిలో సీనియర్‌ అసిస్టెంట్‌గా, జిల్లా పరిషత్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.వి.రమణను ఎచ్చెర్ల మండల పరిషత్‌ కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌గా, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎచ్చెర్ల సబ్‌ డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న బి.గిరిని ఆర్‌డబ్ల్యూఎస్‌ పలాసలో సీనియర్‌ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, సీ–సెక్షన్‌ సూపరింటెండెంట్‌ రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలి


ఫ్యాప్టో ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ : పాఠశాల విద్యాశాఖలో ప్రభుత్వ, పంచాయతీరాజ్‌ యాజమాన్యాల ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే ఎంఈఓ–1 పోస్టులను భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని జోన్లలోనూ ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే స్కూల్‌ అసిస్టెంట్ల ద్వారా ఎంఈఓ–1 పోస్టులు భర్తీ చేయడానికి దాదాపు కసరత్తు చేశారని, ఎంఈఓ–2 పోస్టుల్లో గెజిటెడ్‌ హెడ్మాస్టర్స్‌ ఉంటుండగా.. ఎంఈఓ–1 పోస్టులను ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే స్కూల్‌ అసిస్టెంట్‌ ద్వారా భర్తీ చేయడాన్ని ఎస్టీయూ తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం దాసరి క్రాంతి భవన్‌లో గురువారం ఎస్టీయూ నాయకులు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా పరిషత్‌ యాజమాన్య టీచర్లకు పదోన్నతులలో తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్‌ రూల్స్‌కు సంబంధించి 72,73, 74 జీవోలు అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వ అధికారులే సమన్యాయాన్ని పాటించకుండా పక్షపాత వైఖరితో వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. వెంటనే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకొని ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే ఎంఈఓ–1 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. రీఅపోర్షన్‌ పోస్టుల్లో పని చేస్తున్న టీచర్ల జీతాలు చెల్లింపు, బోధనేతర కార్యక్రమాలను రద్దుచేయాలని, పెండింగ్‌ బకాయిలు విడుదల, పెండింగ్‌ డీఏల చెల్లింపులు, ఐఆర్‌ విడుదల, పీఆర్సీ చైర్మన్‌ నియామకం తదితర సమస్యల పరిష్కారానికి ఈ నెల 2న కలెక్టరేట్‌ వద్ద చేపట్టనున్న ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రతినిధులు చింతల రామారావు, కూన శ్రీనివాసరావు, కె.గడ్డెన్నాయుడు, జి.శ్రీనివాసరావు, బి.రామారావు డీపీఎస్‌ పట్నాయక్‌ వివిధ మండలశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు రెడ్డిపేట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం గ్రామస్తులు గుర్తించారు. ఆమదాలవలస పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి పరిశీలించారు. మృతుడు సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని, నాలుగు రోజులుగా పరిసర గ్రామాల్లో భిక్షాటనం చేస్తూ తిరిగేవాడని గ్రామస్తులు చెబుతున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఐఎంఎల్‌ డిపోను విభజించవద్దు


అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని ఐఎంఎల్‌ డిపోను విభజించి టెక్కలిలో అద్దె ప్రాతిపదికన పెట్టడం సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. గురువారం ఎచ్చెర్ల ఐఎంఎల్‌ డిపో వద్ద కార్మికులు ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు తరాలుగా డిపోలో పనిచేస్తున్న కార్మికుల పొట్టకొట్టవద్దన్నారు. ఎచ్చెర్లలో సొంత గొడౌన్లలో మద్యం సరఫరా చేస్తుంటే అదనంగా టెక్కలిలో మరో డిపో అద్దెకు తీసుకుని ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం అన్యాయమన్నారు. దీనివల్ల లక్షలాది రూపాయల భారం ప్రభుత్వంపై పడుతుందన్నారు. ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ఎచ్చెర్ల డిపోను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏపీబీసీఎల్‌ హమాలీస్‌ యూనియన్‌ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, నడిగింట్ల రమణ, గజినీ శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము, సొంట్యాన శ్రీనివాసరావు, సురేష్‌, పట్నాన శ్రీనివాసరావు, సురేష్‌, రామారావు తదితరులు పాల్గొన్నారు.